సిబ్బంది కొరత..గాడి తప్పుతున్న పాలన

- పురపాలికలో వేధిస్తున్న సిబ్బంది కొరత
- కీలక విభాగాల్లోని కుర్చీలన్నీ ఖాళీ
- 'దుర్గం'లో జోరుగా అక్రమ కట్టడాలు
- ప్రస్తుత బదిలీల్లోనైనా భర్తీ చేసేరా?


రాయదుర్గం మున్సిపల్ కార్యాలయం

రాయదుర్గం: పాలనాపరంగా అన్ని విభాగాల్లో కెల్లా పురపాలక సంఘం కీలకశాఖ. అయితే సరిపడా ఉద్యోగులు ఉంటే పాలన సజావుగా సాగుతుంది. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు ప్రగతిపథంలో పట్టణం పరుగులు పెడు తుంది. అయితే ఎన్నికలకు ముందు మున్సిపల్ కార్యాలయంలోని అన్ని విభాగాలకు అధికారులు, ఉద్యోగులు సంపూర్ణంగా ఉండేవారు. ఎన్నికల అనంతరం బదిలీల్లో భాగంగా ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో ఆయా స్థానాలన్నీ ఖాళీగా ఉన్నాయి. దీంతో పౌరసేవలపై ప్రభావం పడుతోంది. ఖాళీల భర్తీకి ప్రతిపాదనలు పంపినా కొందరు ఉద్యోగులు ఇక్కడ చేరడానికి విముఖత చూపుతున్నారు. దీంతో అర్హతలేని కిందిస్థాయి ఉద్యోగులతోనే నెట్టుకురావాల్సి వస్తోంది.

రాయదుర్గం పురపాలక సంఘం 1963లో ఏర్పాటైంది. మున్సిపల్ కార్యాలయంలో కీలక పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం మున్సిపల్ కమిషనర్ కిశోర్ విధుల్లో ఉన్నారు. ఆ తర్వాత మేనేజర్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, డీఈ, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు ఇలా కీలక విభాల పోస్టుల్లో ఉద్యోగుల కొరత ఉంది. మొత్తం 164 మందికి గాను

పట్టణ జనాభా	75 వేలు
వార్డు సచివాలయాలు	18
అన్ని విభాగాల్లో మొత్తం ఉద్యోగులు	164
విధుల్లో ఉన్నవారు	96
ఖాళీలు	68

96 మంది ఉన్నారు. 68 ఖాళీలు ఉన్నాయి. ఇంజినీరింగ్, శానిటరీ, టౌన్‌ప్లానింగ్ సెక్షన్లలో శాశ్వత ఉద్యోగులు లేక పాలన గాడితప్పింది. శానిటరీ, టౌన్‌ప్లానింగ్ సెక్షన్లలో అవినీతి రాజ్యమేలుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. హెల్త్ విభాగం చూసే ఓ అధికారికి శానిటరీతో పాటు మరో మూడు శాఖల బాధ్యతలు అదనంగా అప్పగించారు. ఎటూ న్యాయం చేయలేక ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా పారిశుధ్యం లోపిస్తోంది. టీపీఎస్ లేక పట్టణంలో అక్రమ కట్టణాలు, అక్రమ లేఔట్లు రోజు కోచోట పుట్టుకొస్తున్నాయి. పట్టించుకునే నాథులే కరువయ్యారు.

ఇంకా 2011 లెక్కల ప్రకారమే?

జనగణన చేపట్టలేదు. దీంతో 2011 నాటి జనాభా లెక్కల ప్రకారమే నిధులు కేటాయిస్తున్నారు. అప్పట్లో 61,749 కాగా, ప్రస్తుతం 75 వేలకు పైగా పెరిగింది. 2011 లెక్కల ప్రకారం చూసినా ఉండాల్సినన్ని పోస్టులు మున్సిపాల్టీ కార్యాలయంలో కేటాయించలేదు. జనగనన జరిగితే మరిన్ని పోస్టులు మంజూరు చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఉండే వాటి కన్నా సగం పోస్టులు ఖాళీగా ఉండడం విశేషం. ప్రస్తుత బదిల్లోనైనా మున్సిపాల్టీకి అవసరమైన పోస్టులు మంజూరుచేస్తే .. పౌరసేవలు, అభివృద్ధి పనుల్లో పురోగతి సాధ్యమౌతుంది. ఎన్నికలకు ముందు సరిపడా ఉద్యోగులు ఉండేవారు. ఆ తర్వాత బదిలీల్లో భాగంగా ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో ఖాళీల సంఖ్య పెరిగింది.

మున్సిపల్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలు

విభాగం	కావాల్సిన సిబ్బంది	ప్రస్తుతం విధుల్లో ఉన్నవారు
టౌన్‌ప్లానింగ్ సూపర్ వైజర్లు	02	02
బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు	04	04
ప్లానింగ్ సెక్రటరీలు	18	18
మేనేజర్	01	01
డీఈ	01	01
ఏఈలు	02	02
శానిటరీ	02	02
టీపీఎస్	02	02

ప్రతిపాదనలు పంపాం



మున్సిపల్ కార్యాలయంలో ఏ విభాగంలో ఏఏ పోస్టులు ఎన్నెన్ని ఖాళీగా ఉన్నాయో గుర్తించి, ఉన్నతాధికారులకు నివేదిక అందించాం. ప్రస్తుత ఉద్యోగుల బదిలీల్లో కీలక పోస్టులన్నీ భర్తీచేసే అవకాశం ఉంది. అన్ని విభాగాలకు రెగ్యులర్ అధికారులు నియమించొచ్చు.

– కిశోర్, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

క్లుప్తంగా

హెచ్ఐవీ బాధితులపై వివక్ష చూపొద్దు

- డీఆర్‌పీ రమేష్ యాదవ్


మాట్లాడుతున్న డీఆర్‌పీ రమేష్‌యాదవ్

కూడేరు: హెచ్ఐవీ బాధితులపై వివక్ష చూపి, వారిని మరింత మానసిక క్షోభకు గురిచేయొద్దని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ డీఆర్‌పీ రమేష్ ప్రజలకు సూచించారు. సోమవారం కూడేరు బస్టాండ్‌లో జిల్లా వైద్యశాఖ,జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ తరఫున చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో ప్రజలకు, వెలుగు కార్యాలయంలో మహిళా సంఘ సభ్యులు, హైస్కూల్‌లో జరుగుతున్న కాంప్లెక్స్ మీటింగ్‌లో ఉపాధ్యాయులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమ్యూనిట ఆర్గనైజర్ రమణ, జోనల్ సూపర్ వైజర్ పెద్దన్న, లింకర్ వర్కర్లు రాజేశ్వరి, మారుతి, ప్రసాద్, స్వప్న, దివ్యభారతి, లక్ష్మీనారాయణమ్మ, భారతి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

కూడేరు: ప్రజలను భాగస్వామ్యం చేసుకొని బాధ్యతగా ఉపాధి పనులు గుర్తించాలని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. ఏపీఓ తులసీ ప్రసాద్, పీఆర్ ఏఈ శ్రీనివాసులు, ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫాతిమా, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. ఈ నెల 23న గ్రామ సభలు నిర్వహించి, పనులు గుర్తింపుపై తీర్మానాలు చేయాలని ఆయన సూచించారు.

రేషన్ సక్రమంగా అందించండి

శెట్టూరు: మండలంలోని కార్డుదారులకు రేషన్ సరుకులు సక్రమంగా అందించాలని తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి అన్నారు. సోమవారం మండలంలో రేషన్ షాపుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. రేషన్ సరుకులు పక్కదారి పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. రేషన్ షాపుల్లో అందుబాటులో ఉంటూ ప్రజలకు సకాలంలో సరుకులు అందజేయాలన్నారు. కార్యక్రమలో డీటీ మహేశ్వర రెడ్డి, వీఆర్‌ఓలు తిప్పేస్వామి, నాగరాజు, తిప్పేస్వామి, శ్రీనివాసులు, గంగన్న, డీలర్లు పాల్గొన్నారు.

కుంటలో పడి ఆవులు మృతి

కంబదూరు: మండలంలోని కురాకులపల్లికి చెందిన గొల్ల రామన్న అనే రైతుకు చెందిన రెండు ఆవులు నీటి కుంటలో పడి మృతి చెందాయి. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామంలో ఉన్న చెన్నపునాయిని కుంట వర్షపునీటితో నిండిపోయింది. సోమవారం రామన్నకు చెందిన ఆవులు నీళ్ల తాగేందుకు కుంటలోకి దిగాయి. ఈ క్రమంలో రెండు ఆవులు నీటి కుంటలో ఉన్న బురదలో చిక్కొని బయటకు రాలేక అక్కడే మృతి చెందాయి. దీంతో రూ.1.20 లక్ష నష్టం జరిగినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

మూడు వినతులు

గుమ్మఘట్ట: మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా వేదికలో మూడు వినతులు అందినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. రస్తా,భూ హద్దులకు సంబంధించి వినతులు అందినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహ మూర్తి, ఈఓఆర్డీ సురేశ్‌బాబు పాల్గొన్నారు.

వేరుశనగ సాగు పనుల్లో రైతులు బిజీ


పూలకుంట వద్ద వేరుశనగ సాగు చేస్తున్న రైతు

గుమ్మఘట్ట: వారం రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో రైతులు వేరుశనగ సాగు పనుల్లో బిజీ అయ్యారు. ఈ నెల 15 వరకు వేరుశనగ సాగు చేసుకోవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలియజేయడంతో సాగుపై రైతులు మొగ్గుచూపుతున్నారు. నియోజకవర్గంలోని గుమ్మఘట్ట, కణేకల్లు, బొమ్మనహాళ్, రాయదుర్గం, డి.హిరేహాళ్ మండలాల వ్యాప్తంగా ప్రధాన పంట వేరుశనగతో పాటు ఆముదం, కంది, సజ్జ,జొన్న, మొక్కజొన్న, పత్తి పంటలను 41,944 హెక్టార్లలో రైతులు సాగుచేశారు. దిగుబడి దేవుడికెరుక.. పశు గ్రాసమైనా దొరుకుతుందనే ఆశతో సాగు చేస్తున్నారు.

హత్యాచార దోషులను కఠినంగా శిక్షించాలి

కళ్యాణదుర్గం రూరల్: కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని జూనియర్ కళాశాల విద్యార్థులు సోమవారం ర్యాలీ చేశారు. టీసర్కిల్‌లో ఆర్‌డీటీ వైద్యసిబ్బందితో కలిసి నిరసన, మానవహారం ఏర్పాటు చేశారు.

యాజమాన్య పద్ధతులతోనే మేలైన దిగుబడి


పొలంబడి కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ శ్రవణ్‌కుమార్

కణేకల్లు: యాజమాన్య పద్ధతులతోనే మేలైన దిగుబడి సాధించొచ్చని వ్యవసాయశాఖ అధికారి ఎ.శ్రవణ్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని కె.కొత్తపల్లి గ్రామంలో జి.వన్నారెడ్డి పొలంలో పొలంబడి కార్యక్రమం జరిగింది. మూడో వారంలో భాగంగా రైతులతో కలిసి ఎంపిక చేసిన పొలంలో సాగు చేసిన వేరుశనగ పంటను ఏఓ పరిశీలించి, యాజమాన్య పద్ధతులు పాటిస్తే కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. ప్రతి ఒక్క రైతూ యాజమాన్య పద్ధతులను అనుసరించాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా సిబ్బంది మనోహర్, లాలుస్వామి పాల్గొన్నారు.

రూ.11.65 లక్షల ఎరువుల విక్రయాల నిలుపుదల ..

మండలంలోని బ్రహ్మసముద్రంలో శ్రీసాయి ఆగ్రో ఏజెన్సీస్ ఎరువుల దుకాణాన్ని ఏఓ శ్రవణ్‌కుమార్ సోమవారం తనిఖీ చేశారు. అనుమతి లేకుండా విక్రయిస్తున్న వివిధ కంపెనీలకు చెందిన ఎరువుల విక్రయాలను నిలుపుదల చేశారు. విక్రయానికి అనుమతులు లేని రూ.11.65 లక్షలవిలువజేసే వివిధ కంపెనీల ఎరువులను నిలిపివేశారు. స్టాక్ బోర్డు, స్టాక్ రిజిష్టర్, సేల్స్ రిజిష్టర్లు సరిగా లేక పోవడంతో షాపు యజమానికి నోటీసులిచ్చారు.

కొండ పోరంబోకు కబ్జాపై సర్వే చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

కంబదూరు: మండల కేంద్రంలోని బీములకుంట రోడ్డు సమీపంలోని కొండకు సంబంధించిన వందలాది ఎకరాల పోరంబోకు భూములు ఆక్రమణకు గురయ్యాయని ఎస్సీ,ఎస్టీ జేఏసీ సంఘం నాయకులు అన్నారు. కబ్జాకు గురైన కొండ పోరంబోకు భూములపై సర్వే చేయించాలని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ బాలకిషన్‌కు వారు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ జేఏసీ నాయకులు డాబా రమేష్, దొణతిమ్మ, శివ, ప్రసాద్, ప్రతాప్, యల్లప్ప పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సిద్ధారూఢస్వామి విగ్రహ ప్రతిష్ట


సిద్ధారూఢస్వామి నూతన విగ్రహ ప్రతిష్ట

రాయదుర్గంటౌన్ : మండలంలోని కెంచానపల్లి గ్రామంలోనిదాసప్ప మఠంలో సిద్ధారూఢస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ సోమవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. సద్గురు శివానందభారతి స్వామి ఆధ్వర్యంలో ప్రతిష్టాపన నిర్వహించారు. ఈసందర్భంగా విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం జరిగింది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, శివానందభారతి భజన బృందం, భక్తులు పాల్గొన్నారు.

చెరువు గండి పూడ్చండి


తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందిస్తున్న రైతులు

కుందుర్పి: రుద్రంపల్లి చెరువు గండి పూడ్చాలని గ్రామానికి చెందిన రైతులు తహసీల్దార్ శ్రీనివాసులుకు సోమవారం విన్నవించారు. మండలంలోని రుద్రంపల్లి చెరువుకు ఇటీవల కురిసిన భారీ వర్షానికి గండిపడిందన్నారు. నెలరోజులకు సరిపడా నీరు చెరువుకు చేరిందని, గండి పడడంతో నీరంతా ఏటిపాలైందన్నారు.

ఓటర్ వెరిఫికేషన్‌ను పక్కాగా చేపట్టండి

కూడేరు: ఇంటింటా ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని పక్కాగా చేపట్టాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ విశ్వనాథ్ బూత్ లెవల్ ఆఫీసర్లకు ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై సమీక్ష నిర్వహించారు. ఈనెల 20 నుంచి అక్టోబర్ 18 వరకు ఈ వెరిఫికేషన్ ఉంటుందన్నారు. ఇంటింటికీ వెళ్లి అర్హత ఉన్న వారందరికీ ఓటర్ కార్డు ఉందా? లేదా ఆరా తీయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు మండల సర్వసభ్య సమావేశం

కూడేరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10:30 గంటలకు మండల సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయ లతిత సోమవారం తెలిపారు. సమావేశానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంసీటీసీ , కోఆప్షన్ సభ్యులు , సర్పంచు లు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

23న ఉపాధి గ్రామసభలు

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా 15 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులపై ఈనెల 23న గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహ మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు.

24న సామాజిక తనిఖీ ప్రజావేదిక

కణేకల్లు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఈనెల 24న ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పీడీ శ్రీనివాసులు, ఏపీఓ సుధాకర్ తెలిపారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు ఉపాధి హామీ కింద రూ.9 కోట్ల పనులు చేసినట్లు తెలిపారు. కుంటకట్టలు, ఫారంఫాండ్స్, ఎంపీటీ తదితర పనులు జరిగాయని, ఈ పనులపై డీఆర్పీ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నారన్నారు. ఈనెల 24న ఉదయం 10 గంటలకు ప్రజావేదిక జరుగుతుందన్నారు.

తేనేటీగల దాడి

కళ్యాణదుర్గం రూరల్: తేనేటీగల దాడిలో దొడగట్ట గ్రామానికి చెందిన పలువురు గాయపడ్డారు. సోమవారం దొడగట్ట గ్రామం సమీపంలో వ్యవసాయ తోటలో లక్ష్మిమూర్తి, బడప్ప, అమరేష్, విష్ణును తేనెటీగలు దాడి చేశాయి. గాయపడిన వీరిని స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. వైద్యుల సూచన మేరకు విష్ణు, అమరేష్‌ను మెరుగైన చికిత్స కోసం అనంతపురం తీసుకెళ్లారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

కంబదూరు: కంబదూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రూ.300కు పైన సభ్యత్వం ఉన్న రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని సంఘం కార్యదర్శి ముత్యాలప్ప ఓ ప్రకటనలో తెలిపారు. ఈకేవైసీ చేయించుకోవాల్సిన రైతులు పట్టదారు పాసు పుస్తకం, బ్యాంక్ పాసుపుస్తకం, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్‌లతో రెండు పాసుఫొటోలను తీసుకొని సహకార సంఘంలో ఇవ్వాలని ఆయన తెలిపారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు డిజిటల్ కీ


డిజిటల్ కీతో కుల,ఆదాయ ధ్రువీకరణ పత్రాలను అప్‌లోడ్ చేస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ విశ్వనాథ్

సాక్షి ఎఫెక్ట్..

కూడేరు: కూడేరు మండల తహసీల్దార్‌గా మోహన్‌కుమార్‌ను జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఆయన విధుల్లో చేరకపోవడంతో డిజిటల్ కీ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో 'సాక్షి'లో ఈనెల 10న ' వామ్మో కూ'డేర్' చేయలేం ' శీర్షికన కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ విశ్వనాథ్ (డీటీ)కి డిజిటల్ కీ అథారిటీని సోమవారం ఇచ్చారు. దీంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం 150 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. ఇన్నిరోజులు డిజిటల్ కీ లేక ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. డిజిటల్ కీ రాగానే ఇన్‌చార్జ్ తహసీల్దార్ విశ్వనాథ్ తన లాగిన్‌లో డిజిటల్ కీతో అప్‌లోడ్ చేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం


ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రిడ్స్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి

కంబదూరు: ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్క విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని రిడ్స్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు నాగరాజు తెలియజేశారు. సోమవారం రిడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మీకు తెలుసా? అనే కార్యక్రమం ద్వారా హెచ్ఐవీ,ఎయిడ్స్‌పై రిడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు హెచ్ఐవీ, ఎయిడ్స్ ఎలా వస్తుంది? ఎలా వ్యాపించదు, ఎయిడ్స్ రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, హెచ్ఐవీ,ఎయిడ్స్ వ్యాధి లక్షణాలు, కండోమ్ ఉపయోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చన్నమల్లప్ప, రిడ్స్ సిబ్బంది యశోదమ్మ, నవ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట


అలంకరణలో వెంకటేశ్వర స్వామి


ప్రతిష్ఠించిన ధ్వజస్తంభం

కూడేరు: మండల పరిధిలోని ఇప్పేరు గ్రామంలో నూతనంగా నిర్మించిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో వెంకటేశ్వర స్వామి విగ్రహం, ధ్వజ స్తంభం ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. వెంకటేశ్వరస్వామి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు చేసి, పుష్పాలతో అలంకరించారు. వేడుకల్లో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ తరఫున అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కేశవ రెడ్డి, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వంద ఎకరాల్లో మామిడి మొక్కల సాగు


మొక్కలు నాటుతున్న రైతులు

కుందుర్పి: మండల కుసుమగిరి రైతు సంఘం ఆధ్వర్యంలో వంద ఎకరాల్లో మామిడి తోటల సాగుకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేసినట్లు సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీపతి, కోఆర్డినేటర్ నరసింహమూర్తి సోమవారం తెలిపారు. కళ్యాణదుర్గం,రాప్తాడు తదితర నియోజకవర్గాల రైతులకు తమ సంస్థ పర్యవేక్షణలో ఉచితంగా పండ్ల మొక్కలు అందిస్తున్నట్లు వారు తెలిపారు.వీరితో పాటు మరో 3 వందల మంది రైతులకు వారం రోజుల్లో మామిడి తదితర పండ్ల మొక్కలను అందజేస్తామన్నారు.

కూలిన ఫిల్టర్ స్టోరేజీ సంపు స్లాబ్


నింబగల్లు ఎస్ఎస్ ట్యాంకు వద్ద కూలిన ఫిల్టర్ స్టోరేజీ సంపు స్లాబ్

ఉరవకొండ: మండలంలోని నింబగల్లు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వద్ద ఉరవకొండకు సరఫరా చేసే ఫిల్టర్ స్టోరేజీ సంపు పైకప్పు కూలిపోయింది. దీంతో ఏళ్ల నాటి సంప్ స్లాబ్ సిమెంట్ దిమ్మెలు, తుప్పు పట్టిన ఇనుప కడ్డీలు సంపులో పడ్డాయి. నీరంతా అపరిశుభ్రంగా సరఫరా అవుతోందని ప్రజలు ఆందోళన చేస్తున్న సమయంలో ఇలా స్లాబ్ కూలిపోవడంతో మరింత కలుషితమయ్యే పరిస్థితి ఏర్పడింది.

ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు


ఉరవకొండలో తహసీల్దార్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి


మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్పకు రాఖీలు కడుతున్న సరస్వతీ శిశు మందిరం విద్యార్థులు


ఉరవకొండ కోర్టు ప్రాంగణంలో లాయర్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి


కళ్యాణదుర్గం: సరస్వతి విద్యామందిర్ పాఠశాలలో ఘనంగా రక్షా బంధన్ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: అన్న, చెల్లి, అక్కా తమ్ముడి బంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ (రాఖీ పౌర్ణమి) వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉరవకొండలోని ఆధ్యాత్మిక కేంద్రం ఈశ్వరీ బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ఉరవకొండ తహసీల్దార్ మహబూబ్‌బాషాతో పాటు రెవెన్యూ సిబ్బంది, ఎంపీడీఓ, పోలీసుల శాఖ సిబ్బందికి రాఖీలు కట్టి మిఠాయిలు పంచారు. ఉరవకొండలో ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో లాయర్లు, సిబ్బందికి రాఖీలు కట్టారు.


తహసీల్దార్ బాలకిషన్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు


తహసీల్దార్ భాస్కర్‌కు రాఖీ కడుతున్న చిన్నారి

దుర్గంలో ఘనంగా రక్షాబంధన్

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఓబుళాచారీ రోడ్డులోని సరస్వతీ శిశుమందిరంలో రక్షాబంధన్ వేడుక సోమవారం ఘనంగా జరిగింది.రక్షాబంధన విశిష్టతను పలువురు తెలియజేశారు. రాఖీ సమైక్యత, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తున్నారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు పొరాళ్ల ప్రధానాచార్యులు రాజేశ్వరి, కమిటీ కార్యదర్శి తుకారాం, కోశాధికారి సోమా నీలకంఠ తదితరులు హాజరయ్యారు. ఈశ్వరీయ ప్రజాపిత బ్రహ్మకుమారీలు పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులకు సంచాలురాలు యోగీశ్వరి ఆధ్వర్యంలో రాఖీ కట్టారు.

ఘనంగా రక్షాబంధన్

కంబదూరు: మండలంలో సోదర బంధానికి ప్రతీకగా జరుపుకునే రాఖీ పర్వదినం వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం ఉదయమే అక్కాచెల్లెళ్లు రాఖీలను దేవుడి ఎదుట ఉంచి పూజలు నిర్వహించారు. ఆతర్వాత రాఖీలను సోదరులకు కట్టి, తిలకం దిద్దారు. బ్రహ్మకుమారీలు అన్ని కార్యాలయాలకు వెళ్లి మండల అధికారులకు రాఖీలు కట్టారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని సరస్వతి విద్యామందిర్‌లో రక్షా బంధన్ కార్యక్రమం ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు కరణం తిప్పేస్వామి మాట్లాడారు. రాఖీ పండుగ సందర్భంగా సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ భాస్కర్‌కు ఓ చిన్నారి రాఖీ కట్టింది.

స్నేహితుల చేయూత


కొండయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న స్నేహితులు

ఉరవకొండ: మలుగూరు, కణేకల్లు గురుకుల పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన ఎల్.కొండయ్య కుటుంబానికి చేయూతనందించారు. జూలైలో కొండయ్య మృతిచెందగా, పూర్వవిద్యార్థులు రూ. 1,00344 ఆర్థికసాయం అందించారు. కుమార్తె పేరుతో రూ.80 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్, రెండు నెలలకు సరిపడా సరుకులు, రూ.10 వేలు నగదు అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎర్రిస్వామి, చిరంజీవి, చిన్నప్పయ్య, నాగరాజు, బాలాంజనేయులు, జయచంద్ర పాల్గొన్నారు.